క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఉప్పరి సమ్మయ్య కుమారుడు ఉప్పరి సాయిబాబు ఇటీవల చెరువులో పడి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బరిగెల సదానందం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కంకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరామర్శించి రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ముంజ కుమారస్వామి, అర్షనపెల్లి ప్రతాప్‌రావు, ఉడుతల సారయ్య, షేక్ ఇమామ్, చంద్రమౌళి, కొలిపాక రాజు, భిక్షపతి, సారయ్య, ఉప్పలయ్య, లింగయ్య, మణికంఠ, సురేష్ తదితరులు ఉన్నారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

దామెర: మండలంలోని ల్యాదెళ్ల శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ల్యాదెళ్ల శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈమేరకు నిందితులు ల్యాదెళ్లకు చెందిన కాలసాని చిన్నసాంబయ్య, హసన్‌పర్తి మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన తాళ్ల నర్సయ్య, జెట్టి యుగేందర్, సిద్దాపూర్‌కు చెందిన చీకటి రంజిత్, పంజాల శ్రీనివాస్, మల్లారెడ్డిపల్లికి చెందిన అల్ల వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదుచేసి 26,370 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, స్కూటీ, ఆటో, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

పర్యావరణ స్పృహ కలిగి ఉండాలి

న్యూశాయంపేట: విద్యార్థులు పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని విశ్రాంత అటవీశాఖాధికారి కాజీపేట పురుషోత్తం అన్నారు. హంటర్‌రోడ్డులోని జూపార్కులో జనవిజ్ఞాన వేదిక, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వేసవి సృజనోత్సవ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. వేదిక ప్రధాన కార్యదర్శి జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత బండారి రమేష్, వకుళాభరణం శ్రీనివాస్, తిప్పర్తి మురళీమోహన్, మహేష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులే అమ్మాలి

ఎంజీఎం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ మందులు మాత్రమే విక్రయించేలా చర్యలు చేపట్టాలని వినియోగదారుల ఫోరం సభ్యులు కోరారు. ఈమేరకు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. చట్ట ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రిలోని మందుల దుకాణాల్లో జనరిక్ మందులే విక్రయించాల్సి ఉండగా బ్రాండెడ్ పేరుతో ఎక్కువ రేట్లకు విక్రయిస్తూ పేద రోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, కె.శ్రీనివాస్, ఈగ సత్యనారాయణ, సారంగం తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం రాజేంద్రంకు సన్మానం

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం మామిడాల రాజేంద్రంను ఎవర్ గ్రీన్ అసోసియేషన్ సభ్యులు గురువారం సన్మానించారు. ఇటీవల పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాలలో 90శాతం ఫలితాలు రావడానికి కృషి చేసిన హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ నాసిర్, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండలోజు కృష్ణమూర్తి, కుమారస్వామి, ఖాదీర్, చంద్రమౌళి, నర్సయ్య పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ సందర్శన

హన్మకొండ అర్బన్: నగరంలోని బాలసముద్రం హయగ్రీవాచారి కుడా మైదానంలో ఏర్పాటు చేసిన వాటర్ టన్నెల్ ఫిష్ మ్యూజియం ఎగ్జిబిషన్‌ను మల్లికాంబ మనో వికాస కేంద్రం పిల్లలు గురువారం సందర్శించారు. ఈమేరకు వారికి ఎగ్జిబిషన్ యాజమాన్యం ఉచిత ప్రవేశం కల్పించింది. అనంతరం పిల్లలకు ఎగ్జిబిషన్ నిర్వాహకులు స్నాక్స్ అందించారు. ఎగ్జిబిషన్ యజమాని అస్లాం, మేనేజర్ ప్రసాద్, ఫిరోజ్, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, కోడం కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ లైబ్రరీ వద్ద అన్నదానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో గత కొన్నినెలలుగా వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జెండా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ జెండా రమేష్, టీఎస్ జేఏసీచైర్మన్ డాక్టర్ బుర్రి ఉమాశంకర్, కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ ప్రేమ్‌సుందర్, కన్వీనర్ శ్రీశైలం, బాధ్యులు ఎల్లబోయిన చంద్రమోహన్, పుప్పాల ప్రవీణ్, అశోక్, రాజేష్, తిరుపతి, నితిన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే ధ్యేయం

ఎల్కతుర్తి: అంధత్వ రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని 18ఏళ్ల పైబడిన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జక్కుల అనిత సూచించారు. భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యం, ఆరోగ్యానికి సర్కారు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అనంతరం, పలువురికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వంగ రవిందర్, సర్పంచ్ భూక్య కవిత, ఎంపీటీసీ సాతూరి రమ, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ అనిత

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఐనవోలు: 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు సూచించారు. మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో చివరి విడత కంటివెలుగు శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరై శ్రీరాములు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్యాధికారులు అందరికి అవగాహన కల్పించి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల బాల్‌రెడ్డి, క్యాంపు ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వివేక్, సూపర్‌వైజర్ కమలాగ్రేస్, ఆప్తమాలజిస్ట్ సరిత, అరుంధతి, నవీన్, ఏఎన్ఎం సృజన, ఆశావర్కర్లు శోభారాణి, రమాదేవి, సునీత, అనిత, రాజేశ్వరి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న శ్రీరాములు

పోలీస్ జాగృతి అవగాహన సదస్సు

ఐనవోలు: మండలంలోని కొండపర్తి గ్రామంలో పోలీస్ జాగృతి ఆధ్వర్యంలో గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దురలవాట్లు, మూఢ నమ్మకాలపై పలు ప్రదర్శనలు చేసి ప్రజలకు వివరించారు. మద్యానికి బానిసైతే కలిగే నష్టాలు, పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైతే కలిగే ఇబ్బందులను తెలియజేశారు. తల్లిదండ్రులను ప్రతీఒక్కరు గౌరవించాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో విలియం బృందం, మెజీషియన్ నారాయణ, ఎస్సై గుగులోతు వెంకన్న, సర్పంచ్ కట్కూరి రాజమణి, వార్డు సభ్యుడు బొక్కల నారాయణ, కట్కూరి బెన్‌సన్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

శాయంపేట: మూగజీవాలైన వన్యప్రాణాలను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సభ్యులు, వరంగల్ అటవీ సంరక్షణ కమిటీ సభ్యులు మారపల్లి సునీల్ హెచ్చరించారు. మండలంలోని పత్తిపాక, గ్రామానికి చెందిన పాషా.. మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి పక్షులను వేటాడడానికి గురువారం ఉచ్చు బిగించారు. ఈ విషయం తెలుసుకున్న సునీల్ అక్కడకు చేరుకొని వేటగాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వేట సామగ్రిని స్వాధీనం చేసుకొని ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని గుర్తుచేశారు.

'మిషన్ వాత్సల్య'ను సద్వినియోగం చేసుకోవాలి

దామెర: మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కాగితాల శంకర్ సూచించారు. మండల కేంద్రంలో మండల చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (ఎంసీపీసీ) సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో మిషన్ వాత్సల్య పథకం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేసి జిల్లా కమిటీకి సిఫార్సు చేశారు. మండలంలోని 6గ్రామాల నుంచి 118మందిని అర్హులుగా గుర్తించినట్లు ఎంపీపీ శంకర్ తెలిపారు. అనాథలు, సెమీ అనాథలకు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై ముత్యం రాజేందర్, మండల వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, వీసీపీసీ కన్వీనర్లు వాణి, జ్యోతి, ఉదయ, సంధ్య, గౌరి, రమ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

శాయంపేట: రైతులు పండించిన పంట ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్ అన్నారు. ఈక్రమంలో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. మండలంలోని గట్లకనిపర్తి గ్రామంలో ఓడీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా దాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, ఎంపీటీసీ బత్తిని రజిని, పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రం రాంచంద్రం, ఉపసర్పంచ్ బోడకుంటి సురేష్, కోఆప్షన్ సభ్యులు గుర్రం అశోక్, వార్డు సభ్యులు కరుణాకర్, సురేష్, మల్లేషం, మాజీ ఉప సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తిలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాయపర్తిలోని కొనుగోలు కేంద్రం పరిశీలన

నడికూడ: నడికూడ మండలంలోని రాయపర్తి కొనుగోలు కేంద్రాన్ని పరకాల సీఐ కిషన్, ఎస్సై శివకృష్ణ గురువారం పరిశీలించారు. ఈమేరకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, పరకాల పీఏసీఎస్ చైర్మన్ జి.నాగయ్య దృష్టికి తీసుకెళ్లి తక్షణమే రైతులకు కావాల్సిన గన్నీబ్యాగులు, లారీలను అందుబాటులో ఉంచారు. రైతులకు అన్యాయం చేస్తే చర్యలు తప్పవని రైస్‌మిల్లర్లను పోలీసులు ఆదేశించారు.

మల్లన్న ఆలయంలో మాస శివరాత్రి పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు



ఒగ్గు కథ చెబుతున్న పూజారులు

ఐనవోలు: మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలను ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నిత్య కైంకర్యాలతో పాటు రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. స్వామివారి కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు నజరు పట్నం వేసి ఒగ్గు కథలు చెప్పి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణదారుడు గట్టు పురుషోత్తమ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మామునూరు: విలీన గ్రామాల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో కార్పొరేటర్ గద్దె బాబు, సొసైటీ వైస్ చైర్మన్ సోల్తీ భూమాతతో కలిసి రోడ్లు, డ్రెయినేజీలను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలుంటే తన దృష్టికి వస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం, తమ కుమార్తె వివాహ శుభలేఖను గ్రామస్తులకు చల్లా ధర్మారెడ్డి, జ్యోతి దంపతులు అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంగెం జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, నిమ్మగడ్డ వెంకన్న, సుంకరి శివ, వేమన రెడ్డి, రాజగౌడ్, సోల్తీ నరేందర్ పాల్గొన్నారు.

నేడు 'మిల్లత్ రాబ్తా' సదస్సు

న్యూశాయంపేట: నేటి రాజకీయ పరిస్థితులు - ముస్లింల పాత్ర అనే అంశంపై వరంగల్ మిల్లత్ రాబ్తా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రధాన వక్తగా కాజీపేట దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా గులాం అఫ్జల్ బియాబాని (ఖుస్రుపాషా) పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

శివాలయం నిర్మాణానికి సహకరిస్తా



వెంకటాపూర్‌లోని శివాలయాన్ని సందర్శించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నాయకులు

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయాన్ని పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం ఇనగాల ట్రస్ట్ ద్వారా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, నాయకులు సదిరం పోచయ్య, జక్కుల ఇందిర, పంచగిరి రాజు, బాబురావు, గోల్కొండ రాజయ్య, పోషిని మహేందర్, కాశెట్టి రాజు, గడ్డం శ్రవణ్, సురేష్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ ఎంపీ'ని అరెస్ట్ చేయాలి

నయీంనగర్: మహిళా మల్లయుద్ధ క్రీడాకారుల (రెజ్లర్ల)పై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, అతని పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీఐటీయూ, ఐద్వా, గిరిజన సంఘం, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కేయూ క్రాస్ జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి దీప, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వీరన్న మాట్లాడారు. కార్యక్రమంలో కుక్కముడి రవీందర్, వల్లెపు రాజు, లింగమూర్తి, వెంకన్న, రాజేష్, రవీంద్రచారి, సుధాకర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయశ్రీ, రమా, ఉమ. విజయ, తిరుపతి, సారయ్య, రమేష్, బాబురావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

మూగజీవాలకు ఎండదెబ్బ

- తిండి, నీరు లేక విలవిల
- అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్న పశువులు

పరకాల: వాస్తవానికి వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు ఎండ, వాన, చలిని తట్టుకునే శక్తి మనుషుల కంటే జంతువులకే ఎక్కువగా ఉంటుంది. అయితే, వారం రోజులుగా ఎండలు విపరీతంగా ఉండటంతో జంతువులు సైతం ఉష్ణోగ్రతను తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. గతేడాది కంటే ఈసారి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితం కావాలని, పశువులను సైతం నీడన ఉంచేలా చూడాలని అధికారులు సైతం హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇవేమీ పట్టకుండా పరకాల పట్టణంలోని పాత సీఎంఎస్ గోదాం వద్ద పశువులను వధిస్తున్న పశుమాంసం విక్రయదారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఎండలోనే పశువులను కట్టేసి నరకం చూపిస్తున్నారు. దీంతో పెరిగిన ఎండలకు తట్టుకోలేక.. మేత, నీళ్లు లేకపోవడంతో అవి మృత్యువాత పడుతున్నాయి. అయినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మృత్యువాత పడుతున్న పశువులను చూసి అయ్యో పాపం అంటూ పశుమాంసం విక్రయదారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎండకు మృత్యువాత పడిన పశువు

మొక్కలు నాటి పరిరక్షించాలి

కేయూ క్యాంపస్: మొక్కలను నాటి పరిరక్షించాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సూచించారు. క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్ టీం ఈనెల 25, 26, 27 తేదీల్లో పర్యటించనున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వలంటీర్లను కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ సమ్మయ్య, ప్రొఫెసర్లు అచ్చయ్య, నర్సింహారెడ్డి, డాక్టర్ స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ సునీత, శశిధర్ పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వీసీ రమేష్, అధ్యాపకులు

మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్య



జబ్బార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ఖిలా వరంగల్: మైనార్టీ గురుకులాల్లో పేద ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని ఖిలా వరంగల్ ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ అన్నారు. వరంగల్ దూపకుంటరోడ్డులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాల అధ్యక్షతన ఈద్గా కార్యవర్గ ప్రతినిధులు సన్మానోత్సవం, అడ్మిషన్లపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ గురుకుల్లో వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. గురుకులాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, ఉచిత భోజన వసతులతో కూడిన సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ట్రిమిస్ కౌన్సిలర్ మహ్మద్ సర్వర్ మొహియొద్దీన్, మహ్మద్ అజ్మత్, మాధవి, మాలతి, ఈద్గా ప్రతినిధులు చాంద్‌పాషా, హైమద్ ఖాన్, అమ్జద్, మహబూబ్ నాజ్, షర్ఫొద్దీన్, అమ్జద్ ఖాన్, కలీం తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫ్రీజర్ బహూకరణ

వరంగల్ అర్బన్: క్రీడాకారుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో వాటర్ ఫ్రీజర్ (డిస్పెన్సర్)ను బల్దియా ఇండోర్ స్టేడియం నిర్వాహకులకు క్లబ్ చార్టర్ అధ్యక్షుడు డాక్టర్ తాళ్ల రవి గురువారం బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ అప్పరాజు రాజు, కార్యదర్శి మాడిశెట్టి నరహరి, కోశాధికారి గుండేటి రమణయ్య, లయన్ మెంబర్లు కోదండపాణి, వంగరి వేణుగోపాల్, మాడిశెట్టి మహేష్, పోశాల సురేందర్, నవీన్, ఆర్కే రాజు, శేఖర్, వెంకట్, పెరుమాండ్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని అశోకా హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన ఫ్యాషన్ ప్రియులు, మగువలను ఆకట్టుకుంటోంది. ఎగ్జిబిషన్ నిర్వాహకులు టీవీ రావు మాట్లాడుతూ ధరించే విధంగా దేశంలో పేరుగాంచిన వివిధ రకాల వస్త్రాలైన ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కాశ్మీర్, సిల్క్ బ్లౌజులు, టాప్స్ వస్‌గ్రాం గోల్డ్ జువెల్లరీ మొదలగునవి లభిస్తాయని తెలిపారు. శుక్రవారంతో వస్త్ర ప్రదర్శన ముగుస్తుందని, వివరాలకు 94411 83981 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆదర్శప్రాయుడు రామసురేందర్

కాశిబుగ్గ: అమరజీవి కామ్రేడ్ రామసురేందర్ ఆదర్శప్రాయుడని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు కొనియాడారు. ఏసీరెడ్డినగర్‌లోని పార్టీ కార్యాలయంలో రామసురేందర్ చిత్రపటానికి నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన 22వ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ శివనగర్ ప్రాంతంలో గూడులేని నిరుపేదల కోసం అనేక భూపోరాటాలు చేసి గూడు కల్పించిన నాయకుడు రామసురేందర్ అని కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య మాట్లాడుతూ కార్పొరేటర్‌గా గెలిచి తనకు వచ్చిన నిధులన్నింటిని పేదల అభివృద్ధికే కేటాయించి డివిజన్ అభివృద్ధికి రామసురేందర్ కృషి చేశారని గుర్తుచేశారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, నలిగంటి రత్నమాల, ఎస్.బాబు, రామస్వామి, సాగర్, యాదగిరి, బషీర్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.